సాక్షి
విజయనగరం

శుక్రవారం ၊ 19 ၊ ఏప్రిల్ ၊ 2024



'ఆరోగ్య ఆసరా'తో భరోసా

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆసరా పథకాలతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు ఆరోగ్య, ఆర్థిక భరోసా కల్పిస్తోంది.

- 8లో



పెళ్లింట విషాదం

వధువుకు ఇవ్వాల్సిన సారి సామగ్రి ఇచ్చేందుకు వెళ్తుండగా మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదం పెళ్లింట విషాదం నింపింది.

- 8లో

ప్రవేశ పరీక్ష రేపు

పార్వతీపురం: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో ప్రవేశానికి శనివారం ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ గురువారం తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్స్‌లో ప్రవేశానికి పార్వతీపురంలో జరిగే ప్రవేశపరీక్షకు మార్చి 31లోగా దరఖాస్తు చేసుకున్న 6,7,8,9 తరగతుల విద్యార్థులు హాజరు కావాలని సూచించారు. ఆ రోజున ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

అట్లకర్ర పట్టుకున్న డాక్టర్



రాజాం: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ గురువారం రాజాం మండలంలోని బొమ్మినాయుడువలస, ముద్దాడజోగివలస, గార్రాజుచీపురుపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. ముద్దాడ జోగివలసలో ఓ పెళ్లింట మహిళలు వండుతున్న పిండి వంటల్లో భాగస్వామ్యమయ్యారు. డాక్టర్ కాస్త అట్లకర్ర పట్టుకోవడంతో మహిళలు మురిసిపోయారు. మహిళల ఓట్లన్నీ జగనన్నకే అంటూ సంతోషంగా చెప్పారు.

వ్యాధుల వివరాల నమోదు తప్పనిసరి



డీఎంహెచ్‌ఓతో మాట్లాడుతున్న ల్యాబ్‌టెక్నికల్ ఆఫీసర్ రవికుమార్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో నమోదయ్యే అన్ని రకాల వ్యాధుల వివరాలను ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ పోర్టల్ (ఐహెచ్ఐపీ)లో నమోదుచేయాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ హెల్త్ ఇంటిలిజెన్స్ (సీబీహెచ్ఐ) ల్యాబ్ టెక్నికల్ ఆఫీసర్ రవికుమార్ సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు, ఇతర అధికారులతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం సమావేశమయ్యారు. జిల్లాలో ఏ ప్రాంతం, ఏ గ్రూపు వారికి, ఏ సీజన్‌లో ఏఏ రకాల వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయో గుర్తిస్తే.. వ్యాప్తిని అరికట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, సర్వజన ఆస్పత్రిని మూడు రోజులపాటు పరిశీలిస్తామని చెప్పారు. ఆస్పత్రుల సిబ్బందికి సూచనలు ఇస్తామన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, సీబీహెచ్ఐ గణాంకాధికారి రామారావు, డీఎంఓ మణి, ఎస్‌ఓ రామారావు, డాక్టర్ వెంకటేష్, హెల్త్ ఎడ్యుకేటర్స్ సత్యరాజ్, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన వర్సిటీ పేరుతో.. రియల్ మోసం





ఈ రెండు చిత్రాలను చూశారా... ఒక చిత్రంలో కనిపిస్తున్న ప్రహరీ గిరిజన వర్సిటీ కోసం కొత్తవలస మండలం అప్పన్నదొరపాలెంలో రూ.5 కోట్ల ప్రజాధనంతో చంద్రబాబు హయాంలో నిర్మించినది. ఆ పక్క చిత్రంలోని లే అవుట్ చూశారా.. ఇది హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు, చంద్రబాబు వియ్యంకుడు నందమూరి బాలకృష్ణ సమీప బంధువు ఇక్కడ సుమారు 3 వందల ఎకరాల్లో వేసిన లేఅవుట్. బంధువు రియల్ ఎస్టేట్ భూములకు డిమాండ్ వచ్చేలా నిర్మాణానికి వీలుకాని భూముల్లో వర్సిటీ ఏర్పాటుకు గత చంద్రబాబు ప్రభుత్వం ఆగమేఘాలమీద శంకుస్థాపన చేసేసింది. ఈ స్థలం పనికిరాదని కేంద్ర బృందం వారిస్తున్నా టెంకాయ కొట్టేసి, ప్రహరీ నిర్మాణ పనులను బినామీకి అప్పగించింది. అంతే.. అదిగో గిరిజన వర్సిటీ.. ఈ ప్రాంతమంతా బంగారుమయం అవుతుందంటూ పచ్చపత్రికల్లో ఊహాజనిత కథనాలు.. వీటిని చూపిస్తూ రియల్‌ఎస్టేట్ వ్యాపారి తనదైన శైలిలో ప్రచారం చేస్తూ కొనుగోలుదారులను నమ్మించారు. తన రియల్ ఎస్టేట్‌లోని ప్లాట్‌లను అధిక ధరలకు అమ్మేశారు. రూ.వందల కోట్లు ఆర్జించారు. కొనుగోలుదారులను నిలువునా ముంచేశారు. స్థలాలు కొనుగోలు చేసిన వారు ఇప్పుడు సగం ధరకు అమ్మేందుకు సిద్ధపడినా కొనుగోలు చేసేవారు కరువయ్యారు. ఇది.. చంద్రబాబు అండ్ కో భూ మాయాజాలం. ఈ మోసంలో స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులకూ భాగం ఉంది. ఈ విషయం బహిర్గతం కావడంతో వర్సిటీని వేరే ప్రాంతానికి తరలించేశారంటూ అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు.


- 2014లోనే కేంద్రం మంజూరు చేసినా తూతూ మంత్రంగా పనులు
- సొంత సామాజిక వర్గ రియల్ ఎస్టేట్ కోసం వర్సిటీ ఆశయానికి గండి
- గిరిజన ప్రాంతానికి చేరువగా ఉండాల్సిన ప్రాంగణాన్ని విశాఖకు చేరువలో ఏర్పాటు
- రూ.5 కోట్ల ఖర్చుతో ప్రహరీ పనులు బినామీలకు అప్పగింత
- అమరావతి తరహాలో భూ పందేరం
- వర్సిటీ పేరుతో సొమ్ము చేసుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే వర్సిటీ ఆశయానికి అనుగుణంగా చర్యలు
- సాలూరు నియోజకవర్గంలో 561.88 ఎకరాల భూమి సేకరణ
- రైతులకు పరిహారం చెల్లించిన తర్వాత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన
- రూ.60కోట్లతో మౌలిక వసతులు



అప్పటి మంత్రి సుజయకృష్ణరంగారావు, కోళ్ల లలితకుమారి కలిసి గిరిజన వర్సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం(ఫైల్)



గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం గిరిజనేతర ప్రాంతంలో సేకరించిన కొండప్రాంతం ..



కొత్తవలస: తిమ్మిని బమ్మిని చేయడం.. బమ్మిని తిమ్మిని చేయడం వంటి కనికట్టు విద్యల్లో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడుకి మించిన వారు ప్రపంచంలోనే ఉండరు. అధికార దర్పణంతో ప్రజాధనాన్ని లూటీ చేయడం.. తమ సామాజిక వర్గానికి మేలు చేయడంలో ఆయన మించిన వారు మరొకరు లేరు. వాస్తవాలను మరుగున పెట్టి మోసం చేయడంలో ఆయన దిట్ట. ఇదే తరహాలో ఎస్.కోట నియోజకవర్గ ప్రజలను నిలువునా ముంచేశారు. కొత్తవలస ప్రాంతంలో గిరిజన వర్సిటీ పేరుతో చంద్రబాబునాయుడు, టీడీపీ నాయకులు కలిసి పెద్ద ఎత్తున భూ వ్యాపారాలు చేపట్టారు. తమదైన శైలిలో ఇన్‌సైడ్ ట్రేడింగ్ జరిపారు. ఈ ప్రాంతీయుల నుంచి రూ.వందల కోట్లు కొల్లగొట్టారు. కారుచౌకగా ఉన్న స్థలాలను అధిక ధరలకు విక్రయించి మోసం చేశారు.

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాకతో వాస్తవాలు వెలుగులోకి...

2019లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గిరిజన వర్సిటీ నిర్మాణ విషయంలో కేంద్ర బృందం ఇచ్చిన నివేదిక బహిర్గతమైంది. తెలుగుదేశం ప్రభుత్వం చేసిన తప్పును గుర్తించింది. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు గిరిజన వర్సిటీని గిరిజన ప్రాంతంలో నిర్మాణానికి చర్యలు చేపట్టింది. జిల్లాల పునర్విభజనలో భాగంగా అచ్చమైన రిజర్వ్‌డ్ పార్లమెంట్, అసెంబ్లీ సెగ్మెంట్‌ల ప్రాంతమైన సాలూరు నియోజకవర్గంలోని మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో సుమారు 561.88 ఎకరాలను సేకరించింది. గిరిజన వర్సిటీకి 2023 ఆగస్టు 25న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కలిసి శంకుస్థాపన చేశారు. గిరిజన విద్యార్థుల చదువుల ఆశయం నెరవేర్చేలా వర్సిటీ నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. తొలుత రూ.60కోట్లతో మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టారు.

ఇంకా ముంచేసేందుకు...

చంద్రబాబు అండ్ కో చేసిన రియల్ ఎస్టేట్ మోసం అందరికీ తెలిసిపోవడంతో కొనుగోలుదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆర్థికంగా నష్టపోయిన వందలాది మంది టీడీపీ నాయకులను ఎక్కడికక్కడే నిలదీస్తున్నారు. దీంతో ఇటీవల ఎస్.కోట పర్యటనలో భాగంగా ఎల్.కోట మండలం సోంపురం కూడలిలో నిర్వహించిన బహిరంగ సభలో గిరిజన వర్సిటీని మళ్లీ కొత్తవలస తీసుకొస్తామంటూ నారా లోకేశ్ సత్యదూరపు ప్రకటన చేశారు. దీనికి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి వంతపాడారు. అంటే... రియల్ ఎస్టేట్ వ్యాపారం ఏ స్థాయిలో జరిపారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కొనుగోలు చేసేవారు ఉంటే ముంచేసేందుకు లోకేశ్‌తో పాటు లలితకుమారి సిద్ధంగా ఉన్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆర్థికంగా దెబ్బతీశారు..



తెలుగుదేశం పార్టీ నేతలు ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు చేసే కనికట్టు విద్యల్లో ఆరితేరారు. గిరిజన వర్సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరతీశారు. వందల కోట్ల రూపాయలు దోచుకున్నారు. ఈ ప్రాంతీయులను ఆర్థికంగా దెబ్బతీశారు. ప్రజలు అప్రమత్తం కాకుంటే ఎన్నిసార్లైనా ముంచేందుకు టీడీపీ నాయకులు సిద్ధంగా ఉంటారు. తస్మాత్ జాగ్రత్త!.

– కడుబండి శ్రీనివాసరావు
శృంగవరపుకోట ఎమ్మెల్యే

వాస్తవం ఇది..

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి గిరిజన యూనివర్సిటీని కేంద్ర ప్రభుత్వ మంజూరు చేసింది. ఈ యూనివర్సిటీని గిరిజన ప్రాంతం, రిజర్వ్‌డ్ అసంబ్లీ లేదా పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో నిర్మించాలి. దీనికోసం తొలివిడతగా రూ.834 కోట్లను కేటాయించి రూ.426 కోట్లను విడుదల చేసింది. దీంతో చంద్రబాబునాయుడు అండ్ కో చకచకా పావులు కదిపారు. యూనివర్సిటీ నిర్మాణ నిబంధనలను తుంగలో తొక్కేశారు. ముందుగా విశాఖకు అతి సమీపంలోని కొత్తవలస ప్రాంతంలో పెద్ద ఎత్తున భూములను అతి తక్కువ ధరకు కొనుగోలు చేయడం, వాటికి ఆనుకొనిఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవడం వంటి పనులు ప్రారంభించారు. ఈ ప్రాంతంలో అతి తక్కువ ధరకు వందల ఎకరాలను కూడబెట్టారు. ప్లాట్‌లు వేశారు. ఇదంతా చూసిన స్థానికులు వీరికేం పిచ్చి.. నివాస యోగ్యంకాని చోట ప్లాట్‌లు వేస్తున్నారని అనుకున్నారు. అప్పుడే మొదలైంది చంద్రబాబు డ్రామా. వారి రియల్ వ్యాపారానికి జాతీయ గిరిజన యూనివర్సిటీ పేరు పెట్టారు. నిబంధనలు దాచిపెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరతీశారు. 2017 సంవత్సరంలో కొత్తవలస మండలం రెల్లి రెవెన్యూ గ్రామం అప్పన్నదొరపాలెం సమీపంలో నిర్మాణానికి ఏ మాత్రం అనువుగా లేని కొండ ప్రాంతంలో సర్వే నంబర్ 1–8లో 526.24 ఎకరాల భూమిని గుర్తించారు. ఇందులో కొంత కొండవాలు ప్రాంతంలో 180 మందికి ఇచ్చిన పట్టా భూమి 185 ఎకరాలను సైతం సేకరించారు. యూనివర్సిటీ నిర్మాణానికి భూసేకరణ పూర్తయిందంటూ కేంద్రానికి నివేదికలను పంపారు. ఎన్నికలకు ఏడాది సమయం ఉండగా హడావిడిగా అప్పటి భూగర్భ గనులశాఖ మంత్రి సుజయకృష్ణరంగారావు చేతుల మీదుగా ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సమక్షంలో 2017 డిసెంబర్ నెలలో శంకుస్థాపన చేశారు. ఆ సమయంలోనే కేంద్ర ప్రభుత్వ అధికారులు పర్యటించి ఈ ప్రాంతం వర్సిటీ నిర్మాణానికి అనువుగా లేదని, ఈ ప్రాంతం ఎస్టీ సెగ్మెంట్‌లో లేదని వ్యతిరేకించారు. నివేదిక సైతం ఇచ్చారు. అయినా.. తమ రియల్ ఎస్టేట్‌వ్యాపారం పూర్తయ్యేవరకు చంద్రబాబు అండ్ కో ఈ నివేదికను బహిర్గతం చేయలేదు. తమ అనుకూల మీడియాతో ఈ ప్రాంతం ఆంధ్రాయూనివర్సిటీ పరిసరాల వలే అభివృద్ధి చెందుతుందని, వర్సిటీ ప్రహరీ పనులు ప్రారంభమైపోయాయంటూ ఊహాజనిత కథనాలతో ప్రచారం చేశారు. ఒక్క ప్రహరీతో కారుచౌకగా కొనుగోలు చేసిన భూములను వందలకోట్ల రూపాయలకు అమ్మేసి.. కొనుగోలుదారులకు పంగనామం పెట్టారు.

జిల్లా ఎన్నికల పరిశీలకులు వీరే



ఎన్నికల వ్యయ పరిశీలకులతో సమావేశమైన కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక, జేసీ కె.కార్తీక్, తదితరులు

పరిశీలకులు, నియోజకవర్గాలు, లైజనింగ్ అధికారి వివరాలు:

సాధారణ పరిశీలకుల పేరు	నియోజక వర్గాలు	లైజనింగ్ అధికారి
హనీష్ చాబ్రా 99941 34000	గజపతినగరం నెల్లిమర్ల విజయనగరం	వీటీ రామారావు, జేడీ, అగ్రికల్చర్ 83310 56251
టలాట్ పర్వేజ్ ఇక్బాల్ 94194 00065	ఎచ్చెర్ల, రాజాం బొబ్బిలి, చీపురుపల్లి	ఎస్.వీ.కే.దుర్గాప్రసాద్ డీడీ, గ్రౌండ్ వాటర్ 77807 09955
సీతారామ్ జాట్ 90015 66945	ఎస్.కోట	జీవీరామారావు డీఈఈ, హౌసింగ్ 70939 30289
వ్యయ పరిశీలకులు:		
ప్రభాకర్ ప్రకాష్ రాజన్ 77382 16259	విజయనగరం పార్లమెంట్	పి.రమేష్ జిల్లా కోపరేటివ్ అధికారి
ఆనంద్ కుమార్ 94773 31909	రాజాం, బొబ్బిలి చీపురుపల్లి విజయనగరం	ఎన్.గోవిందరావు స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ 79813 19403
ఆకాష్‌దీప్ 99103 98592	నెల్లిమర్ల విజయనగరం ఎస్.కోట	పీఎస్‌వీ లక్ష్మీనారాయణ పీడీ, ఏపీఎంఐపీ 79950 87037
రిజర్వ్ లైజనింగ్ ఆఫీసర్: సీహెచ్.ఎస్.చంద్రారావు, డీడీమైన్స్ అండ్ జియాలజీ (91006 88808)		

విజయనగరం అర్బన్: జిల్లాలో ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు, ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేసేందుకు ఆరుగురు ఎన్నికల పరిశీలకులను ఎన్నికల కమిషన్ నియమించింది. వీరిలో ముగ్గురు సాధారణ పరిశీలకులు కాగా మిగిలిన ముగ్గురూ వ్యయ పరిశీలకులు. వీరికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు, అవసరమైన సమాచారాన్ని ఇచ్చేందుకు ఏడుగురు లైజనింగ్ అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి నియమించారు.

వ్యయ పరిశీలకులను కలిసిన జిల్లా అధికారులు

జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు ప్రభాకర్ ప్రకాష్‌రాజన్, ఆనంద్ కుమార్, ఆకాష్ దీప్ గురువారం సాయంత్రం జిల్లాకు చేరుకున్నారు. వీరిని జెడ్పీ అతిథిగృహం వద్ద కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని ఎన్నికల ఏర్పాట్లను వివరించారు. వీరి వెంట లైజన్ ఆఫీసర్లు కూడా ఉన్నారు.

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

తొలి రోజున నామినేషన్ల వివరాలు:

అసెంబ్లీ నియోజకవర్గం	అభ్యర్థి	పార్టీ
నెల్లిమర్ల	అప్పలనాయుడు బడుకొండ	వైఎస్సార్‌సీపీ
	బడ్డుకొండ పద్మావతి	వైఎస్సార్‌సీపీ
విజయనగరం	పెనుమత్స కరుణాకర్	సమాజ్‌వాది
	శ్రీనివాసరావు మండల	ఇండిపెండెంట్
గజపతినగరం	నిల్	నిల్
చీపురుపల్లి	నిల్	నిల్
ఎస్.కోట	వెంకటరావు యాళ్ల	జాతీయ జనసేన
	లోకాభిరామకోటి కొట్యాడ	ఇండిపెండెంట్
రాజాం (ఎస్సీ)	నిల్	నిల్
బొబ్బిలి	ముగడ వెంకటరమణ	ఇండిపెండెంట్
విజయనగరం (పార్లమెంట్)	శ్రీనివాసరావు శంబాన	యుగ తులసి పార్టీ
	సామిరెడ్డి అచ్చియ్యనాయుడు	సమాజ్ వాది

- తొలిరోజు అసెంబ్లీ స్థానాలకు 10, ఎంపీ స్థానానికి 2 నామినేషన్లు దాఖలు

విజయనగరం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ జిల్లాలో గురువారం ప్రారంభమైంది. తొలిరోజు విజయనగరం పార్లమెంటు స్థానానికి రెండు, ఏడు అసెంబ్లీ స్థానాలకు 10 నామినేషన్లు దాఖలయ్యాయి. మొదటిరోజు నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. ఆర్‌ఓ కార్యాలయాలకు వంద మీటర్ల దూరంలోనే పోలీసులు అభ్యర్థుల వాహనాలను నిలిపివేశారు. అభ్యర్థితో సహా ఐదుగురిని మాత్రమే ఆర్‌ఓ కార్యాలయాల లోపలికి అనుమతించారు. అన్ని ఆర్‌ఓ కార్యాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల నిఘా మధ్య నామినేషన్ల ప్రక్రియ నిర్వహించారు. కలెక్టరేట్ సహా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో అభ్యర్థుల సహాయం కోసం హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. హెల్ప్ డెస్క్‌ల వద్ద నామినేషన్ పత్రాలను ఏఆర్‌ఓలు, ఇతర అధికారులు ముందుగా పరిశీలించారు. మొత్తం నామినేషన్ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే, కలెక్టరేట్‌లో నామినేషన్ల ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, విజయనగరం పార్లమెంట్ స్థానం రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి ప్రారంభించారు. తొలిరోజు ఇద్దరు అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. చీపురుపల్లి, రాజాం, గజపతినగరం నియోజకవర్గాల్లో తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

బడ్డుకొండ నామినేషన్‌కు పోటెత్తిన జనం

- జనసంద్రమైన నెల్లిమర్ల పట్టణం
- ఏదారిలో చూసినా అభిమానుల కోలాహలమే..
- గెలుపునకు సంకేతం: బడ్డుకొండ అప్పలనాయుడు



పార్టీశ్రేణుల మధ్య నుంచి నామినేషన్ వేసేందుకు వెళ్తున్న బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ:

నెల్లిమర్ల నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు నామినేషన్‌కు జనం పోటెత్తారు. వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలతో నెల్లిమర్ల పట్టణం కిక్కిరిసింది. పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ, నెల్లిమర్ల మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పాలనపై అభిమానం చాటారు. నెల్లిమర్ల తహసీల్దార్ కార్యాలయంలో ముహూర్తం ప్రకారం గురువారం ఉదయం 11.15 నిమిషాలకు బడ్డుకొండ అప్పలనాయుడు నామినేషన్ పత్రాలను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.నూకరాజుకు అందజేశారు. అభ్యర్థిని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, కందుల రఘుబాబు, పతివాడ అప్పలనాయుడు బలపరిచారు. డెంకాడ మండలం మోపాడలోని తన ఇంటి నుంచి ఉదయం 9 గంటల సమయంలో బడ్డుకొండ నామినేషన్ వేసేందుకు బయలు దేరారు. జొన్నాడ, చింతలవలస, ధర్మపురి, రింగురోడ్, దాసన్నపేట, ఫూల్‌బాగ్ మీదుగా అభిమానులు, పార్టీ శ్రేణుల సమక్షంలో నెల్లిమర్ల తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అభిమానుల కోలాహలం నడుమ నామినేషన్ ఘట్టాన్ని పూర్తి చేశారు. అనంతరం బడ్డుకొండ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో పేద, మధ్యతరగతి ప్రజల్లో ఆర్థికోన్నతి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. పేదలకు మేలు జరగడంతో ఏ గ్రామానికి వెళ్లినా సాదరంగా, సంతోషంతో స్వాగతం పలుకుతున్నారని తెలిపారు. అవ్వా, తాతలు ఆశీర్వదిస్తున్నారన్నారు. జగనన్న పాలనలో చిన్నారుల చదువు బెంగ తీరిందంటూ తల్లిదండ్రులు, సాగు పెట్టుబడి సాయం ఠంచన్‌గా అందుతుందని రైతన్నలు, వైఎస్సార్ ఆసరా, చేయూతతో ఆర్థిక స్వావలంబన కలిగిందంటూ మహిళలు చెబుతుంటే గర్వంగా అనిపిస్తోందన్నారు.

- నెల్లిమర్ల నియోజకవర్గంలో దేశం గర్వించదగిన భోగాపురం గ్రీన్‌ఫీల్డు అంతర్జాతీయ ఎయిర్ పోర్టు పనులు శరవేగంగా సాగుతున్నాయని బడ్డుకొండ తెలిపారు. చింతపల్లితీరంలో సుమారు రూ.25 కోట్ల అంచనా వ్యయంతో ఫ్లోటింగ్ జెట్టీకి సీఎం శంకుస్థాపన చేశారన్నారు. సుమారు రూ.719 కోట్లతో రామతీర్థసాగర్ రిజర్వాయర్ పనులు వైఎస్సార్‌సీపీ హయాంలోనే జరుగుతున్నాయని వివరించారు. రాబోయే రోజుల్లో విశాఖ రాజధానిగా పాలన మరింత చేరువవుతుందని, నియోజకవర్గ ప్రజలకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని చెప్పారు.
- కూటమి అభ్యర్థి లోకం మాధవి, ఆమె భర్త లోకం ప్రసాద్ మిరాకిల్ సంస్థ కోసం పేదల భూములను కొట్టేశారని బడ్డుకొండ అప్పలనాయుడు ఆరోపించారు. 2019లో జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన మాధవికి కేవలం 7,300 ఓట్లు మాత్రమే వచ్చాయన్నారు. మిరాకిల్ సంస్థలో స్థానిక యువతకు ఉపాధి కల్పించడంలో ప్రాధాన్యమివ్వడం లేదన్నారు. 20 ఏళ్ల కిందట దివంగత కొమ్మూరు అప్పడుదొర, నేదురమల్లి జనార్దనరెడ్డిల సహకారంతో మిరాకిల్ సంస్థ అధినేతలు విలువైన భూములను నిరుపేదల నుంచి లాక్కున్నారని ఆరోపించారు. కనీసం ఆయా కుటుంబాల్లో చదువుకున్న యువతకు ఉద్యోగాలు కల్పించకుండా మోసం చేశారన్నారు.
- జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి జరిగిందని, మే 13న జరగబోయే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు ఎదురుగా ఉన్న బటన్‌నొక్కి అత్యధిక మెజార్టీతో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని బడ్డుకొండ కోరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మజ్జి సిరిసహస్ర, బడ్డుకొండ ప్రదీప్‌నాయుడు, బడ్డుకొండ మణిదీప్‌నాయుడు, పతివాడ అప్పలనాయుడు, ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, అంబళ్ల శ్రీరాములు నాయుడు, చనుమల్ల వెంకటరమణ, అంబళ్ల సుధారాణి, బంటుపల్లి వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, తదితరులు

క్లుప్తంగా

వ్యక్తిపై కత్తితో దాడి


గాయపడ్డ సన్యాసిరావు

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామానికి చెందిన ఎం.సన్యాసిరావును అదే గ్రామానికి చెందిన ఆరిపాక సంతోష్ కత్తితో గాయపర్చి హత్యాయత్నానికి పాల్పడటంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ అందించిన వివరాలు.. వావిలపాడుకు చెందిన ఆరిపాక సంతోష్ మద్యం సేవిస్తూ వుంటాడు. సన్యాసిరావుకు సంతోష్ వరుసకు కుమారుడు అవుతాడు. మద్యం సేవించడం మంచిది కాదని సంతోష్‌ను మందలిస్తూ వుండే వాడు. దీన్ని తట్టుకోలేని సంతోష్ గురువారం ఉదయం సన్యాసిరావు ఇంటికి వెళ్లి కత్తితో పీకపై గాయపర్చి హత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్‌ఐ తెలిపారు. దీంతో కుటుంబీకులు సమీపంలో వున్న ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సంతోష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలీస్ సంక్షేమ పాఠశాలలో ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి చర్యలు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏఆర్ పోలీసులైన్స్‌లో నడపబడుతున్న పోలీస్ వెల్ఫేర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఖాళీగా ఉన్న మూడు ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్టు ఎస్పీ ఎం.దీపిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఆరో తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మ్యాథ్స్, ఫిజిక్స్ బయాలజీతో పాటూ ఇంగ్లిష్ సబ్జెక్ట్ కూడా బోధించాల్సి ఉంటుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతను తెలిపే ఒరిజినల్ ధ్రువపత్రాలు, రెజ్యూమ్ తీసుకుని ఏప్రిల్ 26 ఉదయం 10 గంటలకు పాఠశాలలో నిర్వహించబోయే టీచింగ్ డెమో, మౌఖిక పరీక్షకు హాజరు కావాలన్నారు. ఉపాధ్యాయ పోస్టులకు బీఈడీ విద్యార్హతతో పాటూ అర్హతలు కలిగిన అభ్యర్థులు స్కూల్‌లో నిర్వహించే మౌఖిక పరీక్షకు ఆ రోజు హాజరు కావాలన్నారు. వివరాలకు 94917 99315, 91211 09485 సంప్రదించాలని కోరారు.

వెబ్‌సైట్‌లో డీఎడ్ హాల్‌టికెట్లు

విజయనగరం అర్బన్: ఈ నెల 22 నుంచి 27 వరకు జరిగే డీఎడ్ మూడవ సెమిస్టర్ (2022–24 బ్యాచ్ మరియు ఒన్స్ ఫైల్డ్), మొదటి సెమిస్టర్ (2023–25 బ్యాచ్ మరియు ఒన్స్ ఫైల్డ్) పరీక్షలకు హాజరగు విద్యార్థులకు హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో పొందుపరచామని డీఈఓ ఎన్.ప్రేమకుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల కోసం 'బీఎస్‌ఈ.ఏపీ.జీఓవి.ఐఎన్' వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

బాలికపై లైంగిక దాడి

డెంకాడ: మండలంలోని ఒక గ్రామంలో అమానవీయ ఘటన జరిగింది. దిశ పోలీసులు అందించిన వివరాలు.. బుధవారం ఏడేళ్ల బాలికపై 50 ఏళ్ల వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక విజయనగరంలోని ఒక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విజయనగరం దిశ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డివాములు, వాటర్ పైపులు దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామంలో మీసాల రమేష్‌కు చెందిన ఎకరన్నర గడ్డివాము, 80 నీటి పైపులు దగ్ధమయ్యాయి. గురువారం గడ్డివాము వద్ద ఆకస్మాత్తుగా మంటలు చెలరేగి వెనువెంటనే ప్లాస్టిక్ పైపులకు మంటలు అంటుకుని కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న పొందూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు 2 లక్షల రూపాయలు మేర ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు లబోదిబోమంటున్నాడు. అలాగే సంతకవిటి మండలం తాలాడ గ్రామానికి చెందిన బెరవ అప్పలనాయుడు, బెవర రాజారావుల గడ్డివాములతో పాటు 20 బస్తాల ధాన్యం కాలిపోయాయి. రాజాం ఫైర్ స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

సారాతో వ్యక్తి అరెస్టు

సీతానగరం: మండలంలోని బక్కుపేట గ్రామంలో ఎస్‌ఈబీ సీఐ జె.శ్రీనివాసరావు నేతృత్వంలో గురువారం తనిఖీలు చేపట్టిన సమయంలో 190 సారా ప్యాకెట్లతో ఓ వ్యక్తి పట్టుబడగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ముందస్తు సమాచారం మేరకు గ్రామానికి చెందిన పి. లక్ష్మణదొర ఇంట్లో తనిఖీలు చేసి సారాను గుర్తించినట్లు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సై బి.రాజశేఖర్ పట్నాయక్, జె.జగన్నాథరావు, ఎం. శ్రీవాణి, హెచ్‌సీ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

ఆరోగ్య ఆసరాతో భరోసా



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు పాలూరి భవాని. ఈమెది బొండపల్లి గ్రామం. కొంత కాలంగా పొత్తిలో నొప్పి రావడంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరింది. అక్కడ వైద్యులు స్కానింగ్ తీసి హెర్నియాగా నిర్ధారించారు. ఆమెకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్రచికిత్స చేశారు. చికిత్స తర్వాత ప్రభుత్వం ఆరోగ్య ఆసరా కింద రూ.5 వేలు అందించింది. దీంతో ఆమె ఎంతగానో సంతోషిస్తోంది.

- దేశ చరిత్రలో ఎక్కడ లేని విధంగా ఏపీలోనే ఆసరా అమలు
- ఐదేళ్లలో 1.38 లక్షల మందికి ఆసరా వర్తింపు
- ఇందుకోసం రూ.71.01 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం
- 1536 వ్యాధులకు ఆసరా ఇస్తున్న వైనం
- రూ.5 వేల నుంచి రూ.60వేలు వరకు అందిస్తున్న వైనం


సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరోగ్యశ్రీ రోగులు

విజయనగరం ఫోర్ట్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పేద రోగులను ఆదుకుంటోంది. పైసా ఖర్చు లేకుండా వైద్యం అందించడమే కాకుండా చికిత్స అనంతరం భృతి అందిస్తోంది. దీని వల్ల ఆరోగ్యశ్రీ,, ఆరోగ్య ఆసరా పథకాలు రోగులకు ఎంతోగానో ఉపయోగపడుతున్నాయి. రోజురోజుకు కొత్త రోగాలు సమాజాన్ని పట్టిపీడిస్తున్నాయి. దీంతో జనం రోగాలకే అధిక మొత్తంలో వెచ్చించాల్సిన పరిస్థితి. పేద రోగులపై ఈ భారం పడకుండా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం సమాజాన్ని పట్టిపీడిస్తున్న వ్యాధులను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చి ఉచితంగా వైద్య సేవలు అందిస్తోంది.

ఆరోగ్య ఆసరాతో మేలు

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స చేసుకున్న వారు చికిత్సానంతరం ఎటువంటి పనులు చేసుకోలేరు. ఏ పనికి వెళ్లకపోవడం వల్ల వారు కుటుంబ పోషణకు ఇబ్బంది పడతారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆరోగ్య ఆసరా కింద చికిత్సానంతర జీవనోపాధి భృతిని ఇస్తుంది. ఆరోగ్య ఆసరా వల్ల రోగులకు ఆర్థిక భరోసా కల్గుతుంది. జిల్లాలో అధికశాతం మంది పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారే. అంతేకాకుండా 95 శాతానికి పైగా చిన్న కుటుంబాలే. ఇంటి పెద్దకు ఏదైనా కష్టం వస్తే ఆ ఇల్లు గడవడం చాలా కష్టమవుతుంది. అంతేకాకుండా ఇంటి పెద్దను కాపాడుకోవడానికి కుటుంబ సభ్యులు అంతా ఏ పనికి వెళ్లకుండా సపర్యలు చేస్తూ అక్కడే ఉండిపోతారు. ఇటువంటి పరిస్థితుల్లో కొంతమంది తినడానికి తిండి లేక పస్తులు కూడా ఉండే పరిస్థితి ఉంటుంది. ఇటువంటి వారికి ఆసరా ఎంతోగానో ఉపయోగపడుతుంది. రోజుకు రూ.225 చొప్పున నెలకు 5 వేలు వరకు భృతి ఇస్తుంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వృద్ధుడి పేరు ఎ.సన్యాసప్పడు. ఇతనిది ఎస్.కోట. కొద్ది రోజులు క్రితం పక్షవాతం బారిన పడ్డాడు. దీంతో అతని కుటుంబ సభ్యులు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం క్రింద చికిత్స అందించారు. పక్షవాతం వచ్చిన రోగులు 6 నెలలు పాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో ఆ కుటుంబ పోషణ కష్టంగా మారుతుంది. కుటుంబ పోషణ, పౌష్టికాహారం నిమిత్తం ప్రభుత్వం భృతిని చెల్లిస్తోంది. ఆరోగ్య ఆసరా కింద ప్రభుత్వం రూ.30 వేలు చెల్లించింది.

ఆరోగ్య ఆసరా వివరాలు...

సంవత్సరం	శస్త్రచికిత్సల సంఖ్య	ఖర్చు చేసిన నిధులు
2019–20	5,444	రూ.3.75 కోట్లు
2020–21	16,078	రూ.9.65 కోట్లు
2021–22	32,615	రూ.15.51 కోట్లు
2022–23	45,746	రూ.23.12 కోట్లు
2023–24	38,899	రూ.18.95 కోట్లు

1536 వ్యాధులకు వర్తింపు

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 1536 వ్యాధులకు ఆరోగ్య ఆసరా పథకాన్ని వర్తింపజేస్తున్నారు. ఈ పథకంలో భాగంగా ఆపరేషన్ కోసం రోగి చేరిన వెంటనే ఆరోగ్యమిత్ర రోగి బ్యాంక్ అకౌంట్ నంబరును రిజిస్టర్ చేస్తారు. డిశ్చార్జ్ అయిన తర్వాత రోగి బ్యాంక్ అకౌంట్‌లో నేరుగా విశ్రాంతి భృతి జమవుతుంది.

ఐదేళ్లలో 1,38,782 మందికి లబ్ధి

వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం కింద గడిచిన ఐదేళ్లలో లక్షలాది మంది లబ్ధిదారులకు లబ్ధి చేకూరింది. 1,38,782 మందికి లబ్ధి చేకూరింది. ఇందుకోసం ప్రభుత్వం రూ.71.01 కోట్లు వెచ్చించింది.

సైకిల్ మాకొద్దు బాబూ...


చీపురుపల్లి: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీలో చేరిన ఆకులపేటకు చెందిన 30 కుటుంబాలు


రేగిడి : వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్న వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తదితరులు

- వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు

చీపురుపల్లి: రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పాలన చూసి టీడీపీ వర్గీయులు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. సైకిల్ మాకొద్దు.. ఫ్యానే ముద్దు అంటూ వలసపోతున్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం పలు చేరికలు జరిగాయి. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని ఆకులపేట గ్రామానికి చెందిన పిన్నింటి, కొండేటి, మీసాల, పతివాడ ఇంటి పేరుకు చెందిన 30 కుటుంబాలు టీడీపీను వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఇటీవల తమకు తెలియకుండానే టీడీపీ కండువాలు తమకు వేశారని, టీడీపీలో ఉండే పరిస్థితే లేదని వారంతా స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీలోకి వచ్చిన వీరికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాలనాయుడు, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణలు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మీసాల హరి, గవిడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

13వ వార్డు నుంచి చేరికలు

ఇదిలా ఉండగా పట్టణంలోని జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ఆధ్వర్యంలో చీపురుపల్లి మేజర్ పంచాయతీలోని 13వ వార్డు నుంచి పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఇటీవల టీడీపీలో చేరిన 13వ వార్డు మెంబరు తల్లి సంగంరెడ్డి కనకమ్మ, సంగంరెడ్డి శివ, వెలుసూరి వెంకటరమణ తదితరులకు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జుజ్జూరు వర్మ, కంచుపల్లి అశోక్, అడ్డూరి కృష్ణ, బుంగ కనకేశ్వరరావు తదితరులు ఉన్నారు.


చీపురుపల్లి రూరల్(గరివిడి) : టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి వచ్చిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

టీడీపీకి భారీ షాక్

రేగిడి : టీడీపీకి భారీ షాక్ తగిలింది. మండలంలో లక్ష్మీపురం గ్రామంలో టీడీపీకి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. గురువారం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావులు పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీకి చెందిన నేదూరి దుర్గయ్య, బొంతల సంగయ్య, మిరియాలు జప్పన్న, కాయల తవుడు, జోరీగల వెంకటి, కాయల రామారావు, బొంతల రామయ్య, బొంతల అప్పలరాం, నేదూరి అప్పలరాం, మిరియాల లోకేష్ తదితరులతో పాటు మరో 40కి పైగా కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను ప్రజలు అంతా ఆహ్వానిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కెంబూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ ఎర్నేన అప్పలనాయుడు, అప్పాపురం సర్పంచ్ కరణం శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ బాలి తవిటి నాయుడు, పాలవలస దవళేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి.. వైఎస్సార్‌సీపీలోకి...

- పార్టీలోకి ఆహ్వానించిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని దువ్వాం పంచాయతీ నుంచి టీడీపీకి చెందిన 50 కుటుంబాలు గురువారం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సమక్షంలో పార్టీలో చేరారు. విజయనగరంలోని ఆయన నివాసం వద్ద టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోనికి వచ్చిన లారీ ఓనర్స్ అసోషియేషన్ ప్రతినిధి బాలి రామారావు, బాలి రమణ, బాలి కూర్మారావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పతివాడ తవిటినాయుడు, రెల్లి పైడినాయుడు, గొర్లె లోకేష్, గొర్లె చిన్న, బాలాజీ తదితర 50 కుటుంబాలకు చెందిన వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని, జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావటం ఖాయమని అన్నారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలన్నా, మంచి అభివృద్ధి కార్యక్రమాలు అమలు కావాలన్నా ప్రతీ ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఎమ్మెల్యే, ఎంపీ రెండు ఓట్లును వేసి ఎమ్మెల్యేగా బొత్స సత్యనారాయణను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించి జగన్‌మోహన్ రెడ్డిని సీఎంను చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ నేతేటి కృష్ణవేణి, స్థానిక నాయకుడు తోట రవి, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొణిశ కృష్ణంనాయుడు, తాటిగూడ పీఏసీఎస్ అధ్యక్షుడు ఎడ్ల అప్పారావు, వలిరెడ్డి లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామచంద్రమూర్తి పట్టాభిషేకం


స్వామివారికి పట్టాభిషేకాన్ని జరిపిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామతీర్థం శ్రీ రామస్వామివారి దేవస్థానంలో శ్రీరామచంద్రస్వామి పట్టాభిషేక మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుల సమక్షంలో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు చేపట్టారు. యాగశాలలో సుందరకాండ హవనం, గాయిత్రి రామాయణ హవనం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మహాపట్టాభిషేకం సజావుగా సాగాలని ముందుగా విశ్వక్సేనుడి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పూజా ద్రవ్యాలకు పుణ్యాహావచనం గావించి అష్టోత్తర సహస్ర నామార్చనలతో స్వామివారికి విశేష పూజలు చేశారు. శ్రీ సీతారామచంద్ర ప్రభువుల వారిని మంటపంలో ఆశీనులు చేసి రాములోరిని పట్టాభిషిక్తుడిని చేశారు. దీనికి ముందు స్వామివారి బంగారు కిరీటానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణ నడుమ స్వామివారికి బంగారు కిరీట దారణ చేశారు. అర్చకులు సాయి రామాచార్యులు, నరిసింహాచార్యులు, కిరణ్, తదితరులు స్వామివారి పట్టాభిషేక మహోత్సవ ఘట్టాన్ని జరిపించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని బాలుడి మృతి

రాజాం సిటీ : రాజాం పట్టణం చీపురుపల్లి రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లచ్చయ్యపేటకు చెందిన కొండేటి భరద్వాజ్(10) అనే బాలుడు మృతి చెందాడు. రాజాం వైపు వస్తున్న ఓ వాహనం టిఫిన్ నిమిత్తం రోడ్డుపైకి వచ్చిన బాలుడిని ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాదం జరిగిన వెంటనే బాలుడిని ప్రైవేట్ వాహనంలో రాజాంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సను అందిస్తుండగానే మృతి చెందాడు. బాలుడి మృతితో తల్లిదండ్రులు సంతు, వెంకటేష్‌లు బోరున విలపిస్తున్నారు. విషయం తెలుసుకున్న రాజాం సీఐ మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వాహనాన్ని సీజ్ చేసినట్లు వెల్లడించారు.

పెళ్లింట విషాదం

- సారి సామగ్రి ఇచ్చేందుకు వెళ్తుండగా రోడ్డుప్రమాదం
- సంఘటన స్థలంలోనే మహిళ మృతి
- మరో పదకొండు మందికి తీవ్రగాయాలు


భద్రగిరి ఆస్పత్రిలో కమల మృతదేహం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: వివాహానంతరం వధువుకు ఇవ్వాల్సిన సారి సామగ్రి ఇచ్చేందుకు వెళ్తుండగా మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదం పెళ్లివారింట విషాదం నింపింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా..మరో 11 మంది తీవ్రగాయాల పాలయ్యారు. బాధితులు, పోలీసులు తెలిపిన మేరకు ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. కురుపాం మండలంలోని కాకితాడ గ్రామానికి చెందిన పెద్దింటి కాంతారావు, సరోజినిల కుమార్తె లిజితకు కొమరాడ మండలంలోని పూడేసు గ్రామానికి చెందిన యువకుడితో ఇటీవలే వివాహమైంది. వధువుకు సారిసామగ్రి ఇచ్చేందుకు కుటుంబసభ్యులు, బంధువులు గురువారం ట్రక్కర్లు, ఆటోల్లో బయల్దేరారు.


ఈ క్రమంలో అందరికంటే వెనుకగా వధువు సొంతకుటుంబీకులను తీసుకువెళ్తున్న ట్రక్కర్ రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం సమీపంలో అదుపుతప్పి ప్రధానరహదారిలోని కల్వర్టుగోడను బలంగా ఢీ కొట్టింది. దీంతో ఆ వాహనంలో ఉన్న వధువు మేనత్త కమిడి కమల (55) అక్కడికక్కడే మృతిచెందగా..మృతురాలి తమ్ముడు పెద్దింటి భుజంగరావు, మరదలు సుజాత, మరో మేనకోడలు బి. సుగుణ, మేనకోడలి కుమారుడు చైతన్య, మేనకోడలు సుగుణ భర్త రవితో పాటు ఇతర కుటుంబసభ్యులు గంటా పవన్, లిమ్మ సుమన్, పాలక శశిరేఖ, పి.మారతమ్మ, ఎన్.పుష్పరాజ్‌లతో పాటు డ్రైవర్ తేజ తీవ్రగాయాలపాయ్యారు. ప్రమాదం జరిగిన విషయాన్ని గమనించిన ఇతర కుటుంబసభ్యులు క్షతగాత్రులను హుటాహుటిన భద్రగిరి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో కమలను పరీక్షించిన వైద్యాధికారి రవికుమార్ ఆమె అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. అలాగే తల పుర్రె భాగంలో తీవ్రంగా గాయపడిన నాలుగేళ్ల బాలుడు చైతన్యతో పాటు మారతమ్మ, పుష్పరాజు, తదితరులను మెరుగైన వైద్యం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ సంఘటనపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కురుపాం ఎస్సై ఎస్.షన్ముఖరావు తెలిపారు.

లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఆత్మహత్య


మృతుడు శ్రీనివాసరాజు (ఫైల్)

లక్కవరపుకోట : మండలంలోని ఒక చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న పాకలపాటి శ్రీనివాసరావు (47)గురువారం ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ ఆర్.గోపాలరావు తెలిపిన వివరాలు... నిందితుడు వారం రోజుల కిందట 8 సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి యత్నించాడని బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆదివారం నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు. కాగా అప్పటి నుంచి నిందితుడు ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఆదివారం 10 గంటల ప్రాంతంలో ఎస్.కోట ఆర్‌టీసీ కాంప్లెక్స్ సమీపంలో పురుగుల మందు సేవించి అపస్మారక స్థితికి శ్రీనివాసరావు చేరుకోవడంతో స్థానికుల సహాయంతో ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం ఆస్పత్రి సిబ్బంది కళ్లుగప్పి పరారయ్యాడు. దీంతో పోలీసులు నిందితుడు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం మండల కేంద్రం కిత్తన్నకట్టు గెడ్డ సమీపంలో నిర్మానుష్య ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెళ్లి పరిశీలించగా మృతదేహం నిందితుడు శ్రీనివాసరాజుగా గుర్తించారు. ఈ మేరకు మృతుడు తల్లి, తమ్ముడులకు సమాచారం అందించగా మృతదేహాన్ని వారు వచ్చి పరిశీలించి శ్రీనివాసరాజు అని నిర్ధారించారు. మృతుడు తల్లి పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపాలరావు తెలిపారు.

అప్పుల భయంతో వ్యక్తి ఆత్మహత్య


మృతుడు నూకందొర

బాడంగి: అప్పులు తీర్చలేనన్న భయంతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని చినభీమవరం గ్రామానికి చెందిన ఉయ్యాల నూకందొర అలియాస్ ఆది (45) విజయనగరంలోని సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్టు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే.. మృతుడు ఇంట్లో భార్యకు తెలియకుండా రూ.50వేల వరకు అప్పులు చేశాడు. ఈ మొత్తాన్ని ఎలా తీర్చాలో తెలియక ఆందోళనకు గురై బుధవారం ఉదయం అరటి తోట వద్ద పురుగుల మందు తాగి వాంతులు చేసుకొంటూ ఇంటికి చేరుకున్నాడు. భార్య పద్మ చూసి ఏమైందని ప్రశ్నించగా పురుగుల మందు తాగానని చెప్పాడు. దీంతో కుటుంబీకుల సహాయంతో 108 ద్వారా స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతునికి తల్లి అప్పలనర్సమ్మ, భార్య పద్మ ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఆర్.జయంతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

WALK IN INTERVIEW
On 23.04.2024 to 24.04.2024 at
ACTION IN RURAL TECHNOLOGY AND SERVICE
Peddapeta (Village), Burja Mandal, Srikakulam District
POSITION: Marketing Agents to Market Agriculture Commodities and Packaging Goods.
QUALIFICATION: Experience in Marketing to Retail shops
SALARY: 10000 to 18000 Based on Experience
LOCATION: Narasannapeta,Palakonda, Rajam & Ichapuram.
POSITION: Project Associate
QUALIFICATION: MBA, MSC.Sociology and Social Work with Good Communication skills
SALARY: 15000 to 25000 Based on Experience
LOCATION: Kurupam
Email Id: akanoop63@gmail.com
artsnabardfpos@gmail.com
CONTACT: 8885221751, 9110720311

WANTED Teachers & Lecturers
THAMMI NAIDU EDUCATIONAL INSTITUTIONS
(School, Junior & Degree College)
M.M.Nagar, Palakonda, 532440 Parvathipuram Manyam Dist.A.P.
Email: tcsemschool@gmail.com, Mob.7382481612
Applications are invited for the following positions within 7 days.

Name of the post	Subjects & Qualification
Teachers for Pre Primary (LKG & UKG) Primary & High School	Experienced candidates for Telugu, English, Hindi, Mathematics, S.S, Biology, Physics, and Chemistry Subjects with B.Ed / D.Ed must be fluent in English
Teachers for IIT Academy	Experienced candidates for IIT Academy (Mathes & Physics & Chemistry)
Lecturers for Degree & Junior College	Computer Science, Mathes,Physics, Chemistry,English,Telugu, Comp.Operater, Warden & Floor In charges

Salary will be commensurate With experience & ability — Correspondent

సాక్షి క్లాసిఫైడ్స్

FLAT FOR SALE
Booking open 2 B/R Flat 1000 Sft. 27 Lakhs. Loan can be arranged at Vasavi Layout. Near Ayyannapeta. Vizianagaram. Ph : 63035 11633, 90524 51919 [V- 823780]

WANTED
ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185036]

Wanted Leaders M/F in Financial Sector TATA Group. Age : 30+, Q : Degree, Income Upto 1 Lakh Per month. Ph : 94403 24333 [V- 1819]

హైదరాబాదులో కేర్ టేకర్‌గా ఉద్యోగ అవకాశం జీతం 18000+వసతి+భోజనం+ఇన్సూరెన్స్ & సం॥లోపు 22–25వేలు పెరిగే అవకాశం, 20 – 45సం॥ లోపు స్త్రీ/పు అర్హులు. 8381848549 [G-2414]

కష్టపడ్డీని కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000 - 40,000, ఫ్రీ రూమ్+భోజనం, Hyd. Ph: 8317512135 [HA-37]

మర్చంట్ నేవీలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు. విభాగం: ఇంజిన్, డెక్, కుక్. వయసు : 18–28. అర్హత:10వ తరగతి ఉత్తీర్ణత & అంతకంటే ఎక్కువ. Makira Marine Services Pvt. Ltd. Hyderabad (Telangana), Palakkad (Kerala) Ph: 6238686422. [H-778903]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.